క్లుప్తంగా

కార్తికేయుని ఆలయంలో భక్తుల సందడి



మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయం భక్తులతో కోలాహలంగా మారింది. ఆదివారం ఉదయం రాష్ట్రవ్యాప్తంగా తరలి విచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం నిండిపోయింది. ఆలయంలో ఎటు చూసినా భక్తులతో కళకళలాడింది. నాగపుట్ట, నాగమల్లివృక్షం, పొంగళశాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు

ఆర్థిక సాయం



పెడన: అనారోగ్యంతో బాధపడుతున్న పేద వృద్ధురాలికి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సాయం అందించింది. పట్టణంలోని 3వ వార్డు నివాసి చేనేత కార్మికురాలు మెట్ల లక్ష్మి (65) అనారోగ్యానికి గురై మంచానికే పరిమితమైంది. దీంతో ఆమెకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ పెడన శాఖ ప్రతినిధులు ఆర్థిక సాయం, నిత్యావసర సరుకులను ఆదివారం అందజేశారు. రూ.3 వేల నగదు, నెలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేసినట్లు సంస్థ ప్రతినిధులు మట్టా రాధా కృష్ణమూర్తి తెలిపారు. వూటుకూరి సుబ్బా రావు, కాగిత శంకర సాంబశివరావు, కొసనం వెంకట భార్గవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉత్సవాలు



కృత్తివెన్ను: గత ఐదురోజులుగా కృత్తివెన్నులోని శ్రీ దుర్గాపార్వతీసమేత నాగేశ్వర స్వామి వారి దేవస్థానం వద్ద జరిగిన మహాశివరాత్రి ఉత్సవాలు శనివారం స్వామివార్ల పవళింపు సేవతో ముగిశాయి. దీనిలో భాగంగా ఆలయ ఈవో సింగనపల్లి శ్రీనివాసరావు దంపతులు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం పండితులు శాస్త్రోక్తంగా పవళింపు సేవ జరిపారు. ఈ పూజాకార్యక్రమాలతో ఉత్సవాలు ముగిసినట్లు ఈవో పేర్కొన్నారు. ఉత్సవాల సందర్భంగా సహకరించిన భక్తులకు అన్ని శాఖల అధికారులు, సిబ్బందికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

నాంచారమ్మకు ఇంటింటా పూజలు



కోడూరు: భక్తుల కొంగుబంగారంగా పూజలందుకుంటున్న విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారి గ్రామోత్సవంలో భాగంగా చిన్నఅమ్మవారికి భక్తులు ఇంటింటా పూజలు నిర్వహిస్తున్నారు. ఆదివారం విశ్వనాథపల్లి గ్రామంలో కాపు కులస్తుల ఇళ్ల వద్ద గ్రామోత్సవాన్ని నిర్వహించారు. డప్పువాయిద్యాలు, మేళతాళాల నడుమ అమ్మవారిని ప్రతి ఇంటికీ తీసుకువెళ్లి హారతులు పట్టారు. భక్తులు గుండు దీపాలను శిరస్సుపై పెట్టుకొని గారెల దండలు ధరించి అమ్మవారికి పూజలు చేసి మొక్కలు తీర్చుకున్నారు. ఇళ్ల వద్ద సహపంక్తీ భోజనాలు జరిపారు. ఆడపడుచులు కూడా గ్రామానికి తరలిరావడంతో పండుగ వాతావరణం సంతరించుకుంది.


ఘనంగా స్నాతకోత్సవం



పెడన: మండలంలోని కొంకేపూడి సెయింట్ విన్సెంట్ పల్లోటి ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలలో స్నాతకోత్సవం, యోగ్యతాప్రతదినోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. రీజినల్ రెక్టార్ రెవరెండ్ ఫాదర్ బాలాజీ బోయల ముఖ్యఅతిథిగా విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత ఈయన పాఠశాల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ ఫాదర్ జాల యాకోబు, ఫాదర్ జోజి, ఫాదర్ శ్రీకాంత్, పాఠశాల మేనేజర్ ఫాదర్ జయరాజ్, సిస్టర్ చైతన్య, సిస్టర్ హెలెన్‌లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఎంతోగానే ఆకట్టుకున్నాయి. అనంతరం చిన్నారులకు యోగ్యతాపత్రాలను, వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను ఫాదర్ జీవన్ కిశోర్‌రెడ్డితో కలిసి అందజేశారు.



శిథిలావస్థకు చేరిన లింగన్నకోడుపై వంతెన



గుంతలమయంగా విశ్వనాథపల్లి రహదారి

నరకానికి దారులు!

- గుంతలమయంగా నరసింహపురం- విశ్వనాథపల్లి రహదారి
- ఆటోలు, బస్సులు వెళ్లేందుకు వీలు లేని వైనం
- ఇబ్బందులు పడుతున్న మూడు పంచాయతీల ప్రజలు

కోడూరు: మూడు పంచాయతీల ప్రజలు రాకపోకలు సాగించేందుకు అవసరమైన రోడ్డు, కల్వర్టులు శిథిలమై ప్రజలు నరకయాతన పడుతున్నారు. మండలంలోని విశ్వనాథపల్లి, సాలెంపాలెం, పిట్టల్లంక పంచాయతీల్లో సుమారు పది వేల జనాభా ఉంటారు. వీరందరూ మండల కేంద్రమైన కోడూరుకు వస్తుంటారు. ఆయా పంచాయతీల ప్రజలు విశ్వనాథపల్లి–నరసింహాపురం మీదుగా ఉన్న ప్రధాన రహదారి వెంట రాకపోకలు సాగిస్తారు. ప్రస్తుతం ఈ రహదారి అడుగుకో గుంత ఏర్పడి ప్రమాదభరితంగా మారింది.

ప్రమాదకరంగా కల్వర్టులు..

రహదారి వెంట పంటకాలువలు, మురుగుబోదులపై ఉన్న కల్వర్టులు కూడా ప్రమాదభరితంగా మారాయి. ఈ రహదారిలో మొత్తం నాలుగు కల్వర్టులు ఉండగా, అవి మొత్తం శిథిలావస్థకు చేరాయి. నరసింహాపురం దాటిన తరువాత రహదారిని కలుపుతూ లింగన్నకోడుపై నిర్మించిన వంతెన కూడా శిథిలావస్థకు చేరింది.

రహదారి పొడువునా భారీ గుంతలు..

నరసింహాపురం నుంచి విశ్వనాథపల్లి వరకు సుమారు ఆరు కిలోమీటర్లు ఈ రహదారి ఉంది. అయితే రహదారి మొదటి నుంచే భారీ గుంతలు ఏర్పడ్డాయి. రహదారిపై ద్విచక్రవాహనాలు నడిపేందుకు కూడా తీవ్ర ఇబ్బందులే. ఇక రాత్రి వేళల్లో ప్రయాణించే వారు ప్రమాదాల భారిన పడి, ఆస్పత్రి పాలైన ఘటనలు ఉన్నాయి.

జాతరకు లక్షలాది మంది భక్తులు రాక..

విశ్వనాథపల్లిలో అద్దంకి నాంచారమ్మ అమ్మవారి జాతరకు అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారు. ఫిబ్రవరి 28 నుంచి మార్చి 14వ తేదీ వరకు అమ్మవారి గ్రామోత్సవం, ఆలయ ప్రధాన గుడిసంబరం జరుగుతున్నాయి. భక్తులు జాతరకు ఈ రహదారి వెంటే వెళ్లాలి. అయితే రోడ్డు పూర్తి గుంతలమయంగా మారడంతో పరిస్థితి ఇబ్బందికరంగా ఉంటుందని ప్రజలు విమర్శిస్తున్నారు.

పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు..

ఈ సమస్యను అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆయా పంచాయతీల ప్రజలు మండిపడుతున్నారు. అనేక సందర్భాల్లో అధికారులకు విన్నవించినా సంబంధం లేదనట్లుగా వ్యవహరిస్తున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే నూతన రహదారిని నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలి..



రోడ్డు నిర్మాణానికి అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలి. రహదారి పొడవునా భారీ గుంతలు ఏర్పడ్డాయి. కనీసం ద్విచక్రవాహనాన్ని కూడా నడపలేని పరిస్థితికి రహదారి చేరింది. గుంతల వల్ల నిత్యం ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. రాత్రి వేళల్లో గుంతలు కనిపించక, వాటిల్లో పడి చాలా మంది ఆసుపత్రి పాలయ్యారు.

– తోట శేషగిరిరావు, విశ్వనాథపల్లి

నూతన రహదారిని నిర్మించాలి



నూతన రహదారిని నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలి. ఆటోలు, బస్సుల రాకపోకలను నిలిపివేశారు. ఆటోలు లేకపోవడంతో కూలీలు కూడా వెనకడుగు వేస్తున్నారు. మూడు పంచాయతీల ప్రజలు నిత్యం ఈ రహదారిపై ప్రయాణించాలి. రహదారితో పాటు కాలువ, మురుగు డ్రెయిన్లపై ఉన్న కల్వర్టులు, వంతెన కూడా శిథిలావస్థకు చేరాయి.

– టి.రామాంజనేయులు, విశ్వనాథపల్లి

కనుల పండువగా విగ్రహాల ప్రతిష్ఠ

గూడూరు: స్థానిక గంగాపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ అమ్మవారి, వీరభద్రస్వామి వార్ల ఉప ఆలయాల, విమాన గోపుర శిఖర ప్రతిష్ఠ ఆదివారం శాస్త్రబద్ధంగా నిర్వహించారు. రామలింగేశ్వస్వామి ఆలయంలో ఉప ఆలయాల నిర్మాణానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.30 లక్షల సీజీఎఫ్ నిధులు మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో ఉప ఆలయాల నిర్మాణ పనులు పూర్తి కావడంతో ఆదివారం శివశ్రీ అయిలూరి జై కిషోర్‌శర్మ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. పరిసర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డీసీ చైర్మన్ పోతన లక్ష్మీ నరసింహస్వామి, మాజీ ఎంపీపీ కాసగాని శ్రీనివాసరావు, మాజీ సర్పంచులు అన్నం హరిరామకృష్ణ, గోపి నాగబాబు, పోతన రామోజీ, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు.



రామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్

నేడు ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం

చల్లపల్లి: ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు సోమవారం ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలకు మండలం నుంచి 572 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. చల్లపల్లిలో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటుచేయగా విజయ క్రాంతి జూనియర్ కళాశాలలో 312 మంది, విజయ జూనియర్ కళాశాలలో 260 మంది పరీక్షకు హాజరు కానున్నట్లు ఆయా పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు తెలిపారు. ఉదయం 9 గంటలకు పరీక్షలు ప్రారంభమవుతాయి. మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష రాసే విద్యార్థులను ఉదయం 8.30 గంటల నుంచి పరీక్ష గదుల్లోకి అనుమతిస్తామని తెలిపారు. ఉదయం 9గంటల తర్వాత వచ్చిన వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ లోపలికి అనుమతించమని తెలిపారు.

నిధుల కొరత.. నిలిచిన రోడ్డు పనులు



తాడేపల్లి- కొడాలి మధ్య అసంపూర్తిగా నిలిచిపోయిన రోడ్డు

ఘంటసాల: గుంతల మయంగా మారిని ప్రధాన రహదారులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం అరకొర నిధులతో రోడ్ల నిర్మాణ పనులను అసంపూర్తిగా వదిలివేస్తోంది. ఘంటసాల– కొడాలి, ఘంటసాల– రామానగరం వెళ్లే ప్రధాన రహదారులు శిథిలావస్థకు చేరి గుంతలమయంగా మారింది. ఘంటసాల– రామానగరం వెళ్లే ప్రధాన రహదారికి ఎన్నికల ముందు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నిధులు మంజూరు కాగా ఎన్నికలు అయిన తర్వాత కొంత వరకు రోడ్డు మరమ్మతులు చేశారు. అయితే రామానగరం నుంచి శ్రీకాకుళం వయా ఘంటసాల మీదగా గత ప్రభుత్వంలో నూతన రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కాగా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పనులు జరగలేదు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఆయా పనులను రద్దు చేయడంతో రోడ్లు అలానే ఉన్నాయి.

అరకొర నిధులతో..

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గుంతల రహిత రహదారులను నిర్మిస్తామని హాడావుడిగా మొదలు పెట్టిన పనులు మండలంలోని అసంపూర్తిగా నిలిచాయి. ఘంటసాల నుంచి ఘంటసాలపాలెం వరకు రూ.40 లక్షలతో రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభించారు. ఘంటసాల నుంచి రోడ్డు నిర్మాణం చేపట్టగా ఘంటసాలపాలెం వరకు ఇంకా ఒక కిలోమీటరు మేర రోడ్డు పనులు నిలిచిపోయాయి. ఘంటసాలపాలెం నుంచి కొడాలి వరకు రూ.30 లక్షలతో ప్రారంభించిన ఆర్ అండ్‌బీ రోడ్డు మరమ్మతు పనులు ఘంటసాలపాలెం నుంచి తాడేపల్లి వరకే వేసి నిధులు లేకపోవడంతో 80 మీటర్ల రోడ్డు నిర్మాణం ఆగిపోయింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి మిగిలిన రోడ్డు పూర్తి చేసేందుకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం..

రామానగరం– కొడాలి వయా ఘంటసాల ప్రధాన రహదారి నాబార్డు నిధులతో నిర్మించడానికి అంచనాలు పంపగా ఉన్నతాధికారులు రూ.5.5 కోట్లకు అంచనాలను ఆమోదించినట్లు చెప్పారు. నిధులు మంజూరు కాగానే రోడ్డు నిర్మాణం చేపడతాం.

– రమేష్, డీఈ, ఆర్ అండ్ బీ, అవనిగడ్డ

ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ అందజేత

అవనిగడ్డ: అవనిగడ్డకు చెందిన ఉపాధ్యాయుడు గంధం ప్రసాద్‌కు అత్యవసర నిమిత్తం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్‌ని అందించారు. రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ గుడివాక శేషుబాబు ద్వారా ప్రసాద్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ వంగర శేషగిరిరావు, స్థానిక రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ గరికపాటి హరిప్రసాద్, కోశాధికారి అల్లంశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం



చల్లపల్లి: రంజాన్ ఉపవాస దీక్షలు ఆదివారం ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా ముస్లింల ప్రార్థనా మందిరాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. చల్లపల్లిలోని మహమ్మదీయ మస్జీద్, నారాయణరావు నగర్‌లోని గౌసియా మస్జీద్, లక్ష్మీపురంలోని మస్జీదులను ఆయా కమిటీల ప్రతినిధులు విద్యుత్ దీప కాంతులతో శోభాయమానంగా అలంకరించారు. ముస్లింలు ఉపవాస దీక్షలు విరమించుకునేందుకు, రంజాన్ నమాజులు చేసేందుకు కమిటీ పెద్దలు ప్రత్యేక ఏర్పాటు చేశారు.

చికిత్స పొందుతూ ఆలయ ఉద్యోగి మృతి



పెదకళ్లేపల్లి(మోపిదేవి): మండలంలోని పెదకళ్లేపల్లి శ్రీ దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామివారి దేవస్థానంలో గత కొన్ని సంవత్సరాలుగా ఎన్ఎంఆర్‌గా పనిచేస్తున్న బచ్చు ప్రదీప్ (34)కు బ్రెయిన్‌డెడ్ అయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పది రోజుల క్రితం దేవస్థానంలో విధుల్లో ఉండగా తూలిపడి పోవడంతో వెంటనే అవనిగడ్డ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. వైద్యుల సూచన మేరకు విజయవాడలో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందినట్లు తెలిపారు. ప్రదీప్ మృతి పట్ల చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల సిబ్బంది తీవ్ర విచారం వ్యక్తంచేశారు. ప్రదీప్ అవివాహితుడు అని తెలిసింది.

విరబూసిన పూత.. మది పులకింత



నాగాయలంక: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూలు విరబూసిన మామిడి మొక్క చూపరులను ఇట్టే ఆర్షిస్తోంది. పాఠశాల కార్యాలయం ఎదుట ఉన్న ఈ మామిడి మొక్క పూత గుత్తులు, గుత్తులుగా రావడంతో పాఠశాల వర్గాలను, విద్యార్థులను పరవశింప చేస్తోంది. అయితే గత ఏడాది కూడా ఇలాగే పూసిందని కానీ, కాయలు రాలేదని పదోతరగతి విద్యార్థులకు విద్యా సేవ చేస్తున్న రిటైర్డ్ హెచ్.ఎం పీవీ నాగేశ్వరరావు చెప్పారు. భారీ పూల గుత్తులకు అదే స్థాయిలో కాయలు వస్తే పంట పండి నట్లే!

వైఎస్సార్ సీపీ నాయకుల పరామర్శ

గూడూరు: మాజీ మంత్రి జోగి రమేష్, వైఎస్సార్ సీపీ పెడన ఇన్‌చార్జి ఉప్పాల రాము ఆదివారం మండలంలోని పినగూడూరులంకలో పర్యటించారు. గూడూరు మండల కో ఆప్షన్ సభ్యుడు కరీముల్లా మాతృమూర్తి ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం పార్టీ నాయకులతో కలిసి గ్రామానికి వచ్చిన జోగి రమేష్ కరీముల్లా కుటుంబ సభ్యులను పరామర్శించారు. సాయంత్రం ఉప్పాల రాము గ్రామంలో పర్యటించి కరీముల్లా కుటుంబ సభ్యులను కలిసి సానుభూతి తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, వైస్ ఎంపీపీ నేతల కుటుంబరావు, పార్టీ మండల అధ్యక్షుడు పర్ణం పెదబాబు, కారుమంచి కామేశ్వరరావు, కోడే చిన వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కరీముల్లా కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి జోగి రమేష్

వైఎస్సార్ సీపీ నేతలకు మాజీ ఎమ్మెల్యే సింహాద్రి పరామర్శ

చల్లపల్లి: మండలంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకలను అవనిగడ్డ నియోజకవర్గ పార్టీ కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఆదివారం పరామర్శించారు. లక్ష్మీపురం ఎస్సీ కాలనీకి చెందిన పార్టీ నాయకుడు కాకి ఉమను పరామర్శించారు. ఉమ తండ్రి ఆదిశేష (65) అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందారు. కాగా సింహాద్రి రమేష్‌బాబు ఉమ ఇంటికి వెళ్లి ఆదిశేషు చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబానికి భరోసా ఇచ్చారు. అనంతరం పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు బొందలపాటి లక్ష్మిని పరామర్శించారు. చింతల మడలో గుడిసేవ ప్రదీప్‌ను పరామర్శించారు. సింహాద్రి వెంట పార్టీ మండల అధ్యక్షుడు సీరం వెంకట సత్యనారాయణ (నాని), యువజన అధ్యక్షుడు వెనిగళ్ల తారక జగదీష్, నాయకులు మోపిదేవి ద్వారకానాథ్, మత్తి రాంబాబు, మోదుమూడి కుటుంబరావు, ఎస్సీ నాయకులు జుజ్జువరపు భాగ్యారావు తదితరులు ఉన్నారు.

ఘనంగా పేర్ని కిట్టు పుట్టినరోజు వేడుకలు

కోనేరుసెంటర్: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్చార్జి, యువ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) పుట్టినరోజు వేడుకలను ఆదివారం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పేర్ని కిట్టుకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ కేక్‌ను కట్ చేశారు. నాయకులు కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బూరగడ్డ రమేష్ నాయుడు, అచ్చేబా, లంకే వెంకటేశ్వరరావు, చిటికెన నాగేశ్వరరావు, శీలం బాబ్జి, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, సర్పంచులు, మాజీ సర్పంచులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పేర్ని కిట్టు పుట్టినరోజు వేడుకల్లో నాయకులు, కార్యకర్తలు

వెలవెలబోయిన హంసలదీవి సాగర తీరం

టోల్ వసూలే కారణం

కోడూరు: హంసలదీవి సాగరతీరం పర్యాటకులు లేక వెలవెలబోయింది. పాలకాయతిప్ప బీచ్‌లోకి వెళ్లేందుకు అటవీ అధికారులు టోల్ వసూలు చేయడంతో చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలు తీరానికి వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదు. ఆదివారం సెలవుదినం అయినప్పటికీ తీరానికి వచ్చిన పర్యాటకుల సంఖ్య నామమాత్రంగానే ఉంది. ఎక్కడా లేని విధంగా హంసలదీవి సాగరతీరానికి వచ్చే పర్యాటకులతో పాటు వాహనాల యజమానుల నుంచి కూడా టోల్‌ను అటవీ అధికారులు వసూలు చేయడంతో బీచ్‌కు వచ్చేవారి సంఖ్య గణనీయంగా తగ్గిందని స్థానికులు చెపుతున్నారు. పర్యాటక రంగంగా హంసలదీవిని అభివృద్ధి చేస్తామంటూ ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చే పాలకులు టోల్ వసూలుపై నోరు మెదపకపోవడం విమర్శలకు గురవుతోంది. రెండు నెలల నుంచి తీరానికి వచ్చేవారి సంఖ్య వందల్లోనే ఉంటుందని, ఇదే పరిస్థితి కొనసాగితే హంసలదీవి విశిష్టత దెబ్బతినే ప్రమాదం ఉందని యాత్రికులు వాపోతున్నారు. వెంటనే టోల్ వసూలును నిలిపి వేసి మళ్లీ హంసలదీవి బీచ్‌కు పూర్వ వైభవం తీసుకురావాలని పర్యాటకులు కోరుతున్నారు. ఇక తీరంలో నామమాత్రంగా ఉన్న పర్యాటకులకు జాగ్రత్తలు చెబుతూ పాలకాయతిప్ప మెరైన్ పోలీసులు గస్తీ నిర్వహించారు.



తీరంలో గస్తీ నిర్వహణకు వచ్చిన మెరైన్ పోలీసులు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కోనేరుసెంటర్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని యోగా గురువు ఎం.శాస్త్రి తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీస్ గ్రౌండ్‌లోని సమావేశపు మందిరంలో ఆదివారం మహిళా పోలీసులకు యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా యోగా గురువు శాస్త్రి మహిళా పోలీసులకు యోగాసనాలు, భ్రామరీ ప్రాణాయామం, భస్త్రికా ప్రాణాయామం, కపాలభాతిలతో పాటు సూర్య నమస్కారాల కార్యక్రమంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. శాస్త్రితో పాటు మద్దాల చింతయ్య ఈ శిక్షణ తరగతులు నిర్వహించారు. దిశా సీఐ వెంకటేశ్వరరావు, మహిళా పోలీసులు యోగా తరగతులకు హాజరయ్యారు.



యోగాసనాలు వేస్తున్న దిశ మహిళా పోలీసులు, సీఐ వెంకటేశ్వరరావు

సంపటాలమ్మతల్లి ఆలయంలో పూజలు

చల్లపల్లి: స్థానిక గ్రామ దేవత శ్రీ సంపటాలమ్మ తల్లిని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ దర్శించుకుని పూజలు చేయించారు. అమ్మవారి 26వ వార్షిక మహోత్సవాలు ఆదివారం ముగింపు సందర్భంగా ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన బుద్ధప్రసాద్‌కు పండితులు ఘంటసాల శతానందశాస్త్రి, ఆలయ అర్చకుడు చల్లపల్లి కోటేశ్వరరావులతో ప్రత్యేక పూజలు చేయించారు. ఎమ్మెల్యే వెంట గ్రామ సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఉప సర్పంచ్ ముమ్మనేని నాని, ఆలయ కమిటీ సభ్యులు లంక బాలగంగాధరరావు, యడ్ల మధుసూదనరావు, రావులపల్లి వెంకటేశ్వరరావు, గొర్రెపాటి పిచ్చేశ్వరరావు, విన్నకోట శంకర్, గౌరిపర్తి మోహనరావు, వేముల శేషగిరిరావు తదితరులు ఉన్నారు. వారికోత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన అన్న సమారాధనలో వేలాది మంది భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.



సంపటాలమ్మ తల్లి ఆలయంలో పూజలు చేయిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

ఆర్యవైశ్య ప్రముఖుడు మృతి

బంటుమిల్లి: బంటుమిల్లికి చెందిన ఆర్యవైశ్య ప్రముఖుడు, పెట్రోల్ బంక్ యజమాని వురా రామకృష్ణారావు అలియాస్ రాంపండు (87) ఆదివారం మృతి చెందారు. గత కొన్ని రోజులుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. రాంపండు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా, రాష్ట్ర స్థాయిలో పలు పదవుల్లో పనిచేశారు. మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య అనుచరుడిగా రాంపండు గుర్తింపు పొందారు. ఆయన మృతికి సంతాపంగా వ్యాపారులు షాపులను మూసివేసి సానుభూతిని తెలియజేశారు. పలువురు ప్రముఖులు రాంపండు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.



రాంపండు